క్లుప్తంగా

వెయ్యి మందికి వైద్య పరీక్షలు



తిరువూరు: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆదివారం మధుమేహ రోగుల ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. నాగార్జున స్కూలు ఆవరణలో ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరంలో వైద్యులు రవీంద్ర, శ్రావ్య, లక్ష్మణరావు, అలేఖ్యలు వెయ్యి మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. రక్తపోటు, మధుమేహం, మూర్ఛవ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రతిరోజూ క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తూ, మితాహారం తీసుకుంటే ఆరోగ్యవంతులుగా ఉంటారని సూచించారు. జనవిజ్ఞాన వేదిక సభ్యులు వైద్య శిబిర నిర్వహణలో సహకరించారు. కృష్ణా, ఎన్టీఆర్, ఏలూరు, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల నుంచి రోగులు విచ్చేశారు.

ఉచిత ఎముకల వైద్య పరీక్ష శిబిరం



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి 5వ సచివాలయంవద్ద ఉచిత ఎముకల వ్యాధి నిర్ధారణ పరీక్ష శిబిరం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ కొండపల్లి పట్టణ అధ్యక్షుడు మిక్కిలి శరభయ్య వైద్య శిబిరం ఆదివారం ప్రారంభించారు. ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ సూచనలతో బీరం సాంబశివరావు ఆర్థోపెడిక్ వైద్యులు తులసి, మహేష్, వైద్యశాల సిబ్బంది రూ. 1800 విలువైన బీఎండీ (బోన్ మినరల్ డెన్సిటీ టెస్ట్) వైద్య పరీక్షలు 150 మందికి ఉచితంగా చేశారు. వీటితో పాటు మధుమేహం, బీపీ, సాధారణ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు ఆనంద్, షేక్ నూరా ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



నూజివీడు: విజయవాడలోని పటమట ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన 14వ జాతీయ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో తమ విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు నూజివీడులోని సాయిప్రణీత స్కూల్ ప్రిన్సిపాల్ కానూరి అనురాధ ఆదివారం తెలిపారు. సింగిల్ కటా విభాగంలో మూడు ప్రథమ, రెండు ద్వితీయ, ఏడు తృతీయ స్థానాలు, టీం కటా విభాగంలో మూడో స్థానం సాధించినట్లు చెప్పారు. ఓవరాల్ చాంపియన్ షిప్ సాధించిన తమ విద్యార్థులు విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందుకున్నారని తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులను ప్రిన్సిపాల్‌తో పాటు కరాటే కోచ్ యూ విజయ్‌కుమార్. పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర



నూజివీడు: ప్రజల సంక్షేమంతో పాటు అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి జీఆర్‌కే రంగారావు అన్నారు. మండలంలోని మీర్జాపురం, గొల్లపల్లిలలో ఆదివారం వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ నిధులతో జలజీవన్ మిషన్, ఆయుష్మాన్ భారత్, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ తదితర పథకాలను అమలు చేస్తూ ప్రజల సంక్షేమానికి కృషి చేస్తోందన్నారు. సర్పంచ్ బొకినాల వెంకటేశ్వరమ్మ, ఈవోపీఆర్డీ టి సరస్వతి, ఏవో ఆలూరు చాముండేశ్వరి, పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీనివాస్, బీజేపీ మండల అధ్యక్షుడు గోగినేని శ్రీనివాస కుమార అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

రేపు పరీక్షలపై అవగాహన సదస్సు

తిరువూరు: ఏపీపీఎస్సీ నిర్వహించే గ్రూప్ 1, గ్రూప్2 పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు ఈ నెల 19న తిరువూరులో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా గౌరవాధ్యక్షుడు మచ్చా శ్రీనివాస్ తెలిపారు. 19న సాయంత్రం బోస్ సెంటర్లోని విన్నర్స్ కోచింగ్ సెంటర్ ఆవరణలో ఈ సదస్సు జరుగుతుందని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు విద్యార్థులకు సూచనలు, సలహాలు ఇచ్చి పరీక్షా విధానం తెలియజేస్తారన్నారు. హాజరైన విద్యార్థులకు స్టడీ మెటీరియల్ ఉచితంగా ఇస్తారని తెలిపారు.

మత్స్యకారులకు ప్రభుత్వ భరోసా

చేపల వేటపై రెండు వేల కుటుంబాల జీవనోపాధి

కృష్ణానదిలో మత్స్య సంపదను జీవనోపాధిగా చేసుకున్న మత్స్యకారులకు ప్రభుత్వం భరోసా కల్పిస్తోంది. జిల్లా మత్స్యశాఖ ఆధ్వర్యంలో ప్రతి ఏటా కృష్ణా నదిలో 20 లక్షల చొప్పున ఇప్పటికే 80 లక్షల చేప పిల్లలు వదిలి పరోక్షంగా వారి జీవనోపాధికి మార్గం సుగమం చేసింది. సోమవారం ఫెర్రీ వద్ద కృష్ణానదిలో వివిధ ప్రాంతాల్లో మరో 20 లక్షల చేప పిల్లలను వదిలేందుకు మత్స్యశాఖ ఏర్పాట్లు చేసింది.



ఇబ్రహీంపట్నం ఫెర్రీ వద్ద కృష్ణానదిలో చేపల వేటకు వెళుతున్న మత్స్యకారుడు

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం మండలం దాములూరు నుంచి భవానీపురం వరకు సుమారు 20 మత్స్యకార సొసైటీల ద్వారా రెండు వేల మంది మత్స్య కార్మికులు జీవనోపాధి పొందుతున్నారు. సబ్సిడీ ద్వారా పడవలు, వలలు ఇవ్వడంతో పాటు అన్ని సంక్షేమ పథకాలు వారి కుటుంబాలకు అమలు చేస్తోంది.

నదీ తీర గ్రామాల్లో చేపలవేటే జీవనాధారం

నదీ తీర ప్రాంతాలైన దాములూరు, కొటికలపూడి, ఇబ్రహీంపట్నం ఫెర్రీ, జూపూడి, మూలపాడు, తుమ్మలపాలెం, గుంటుపల్లి, సూరాయిపాలెం, గొల్లపూడి, భవానీపురం ప్రాంతాల్లో సుమారు 20 మత్స్యకార సంఘాలు ఉన్నాయి. 1975 నుంచి సంఘాలు రిజిస్టర్ చేసుకుని ప్రభుత్వం ద్వారా లైసెన్సులు పొంది చేపల వేటపై జీవిస్తున్నారు. ప్రస్తుతం రెండు వేల కుటుంబాల వారు నదిపై చేపల వేటకు వెళ్లి రోజుకు రూ.1,500 నుంచి రూ.2వేలు వరకు సంపాదిస్తూ కుటుంబాలను పోషిస్తున్నారు. గతం కంటే ప్రస్తుత పరిస్థితులు చేపల వేటకు ఆశాజకంగా ఉన్నాయని మత్స్యకారులు చెబుతున్నారు.

మత్స్య కార్మికులకు సంక్షేమ పథకాలు

ప్రభుత్వం మత్స్య కార్మికుల కుటుంబాలకు అన్ని రకాల సంక్షేమ పథకాలు అమలు చేస్తోంది. నదిలో మత్స్యసంపదపై జీవించేవారికి 50 ఏళ్లకే పెన్షన్ మంజూరు చేస్తోంది. పడవులు, వలలు పొందేందుకు గతంలో 50 శాతం సబ్సిడీ ఉండగా ప్రస్తుతం 75 శాతం సబ్సిడీపై అందజేస్తుంది. 35 శాతం సబ్సిడీపై రుణాలు మంజూరు చేస్తుంది. ఫిష్ ఆంధ్ర పథకంలో రిటైల్ ఔట్‌లెట్ దుకాణాలు, మొబైల్ యూనిట్లు పంపిణీ చేసి మత్స్యకారుల కుటుంబాల్లో ప్రభుత్వం వెలుగులు నింపుతోంది. సముద్రంలో చేపలవేట నిషేధ సమయంలో వైఎస్సార్ మత్స్యకార భరోసా పథకంలో ఇస్తున్న రూ.10వేలు నదిపై జీవించే వారికి కూడా కనీసం రూ.5వేలు ఇవ్వాలని కోరుతున్నారు. ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల పరిధి గ్రామాల మత్స్యకార్మికులకు సరిహద్దు సమస్యలపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత మత్స్యశాఖ అధికారులపై ఉందని ప్రధాన మంత్రి మత్స్యసంపద యోజన జిల్లా డైరెక్టర్ గోవిందరాజు అధికారులను కోరారు.



ఇబ్రహీంపట్నం వద్ద వలతో చేపలు పడుతున్న మత్స్యకార్మికుడు

ఆశాజనకంగా చేపల వేట



కృష్ణానదిలో చేపలవేట ఆధారంగా 40 ఏళ్లుగా జీవిస్తున్నాం. ప్రస్తుతం చేపలవేట ఆశాజనకంగా ఉంది. ప్రభుత్వం ప్రతి ఏడాదీ నదిలో చేపపిల్లలను వదలడం ద్వారా మత్స్య సంపద పెరిగింది. కొన్ని గ్రామాల్లో దోమతెరలతో చేపలు పట్టడంతో లార్వాదశ పిల్లలు చనిపోతున్నాయి. ఈ విధానంపై అధికారులు చర్యలు తీసుకుని నివారించాలి.

– నదకుదిటి ఆదిశేషారావు, మత్స్యకారుడు, ఫెర్రీ

మత్స్యకారులకు ప్రభుత్వ ప్రోత్సాహం



చేపల వేటపై జీవించే వారికి ప్రభుత్వం సబ్సిడీతో పడవలు, వలలతో పాటు నవరత్నాల సంక్షేమ పథకాలు అమలు చేస్తుంది. 50 ఏళ్లకే పెన్షన్ అందిస్తుంది. లైసెన్స్ కలిగిన వారు నదిలో ఎక్కడైనా చేపల వేట చేసే విధానం ఉండాలి. ప్రభుత్వం నాలుగున్నరేళ్లలో లక్ష చేప పిల్లలు నదిలో విడిచి మత్స్యకారులను ప్రోత్సహిస్తుంది.

–లంకే గోవిందరాజు, ప్రధానమంత్రి మత్స్యసంపద యోజన జిల్లా డైరెక్టర్

ధనుర్మాసోత్సవాలు ప్రారంభం



తిరువూరు కోదండరామాలయంలో తిరుప్పావై పఠిస్తున్న వైష్ణవ భక్తులు



వేంకటాచలస్వామి ఆలయంలో పూజలు



ఆలయంలో సహస్ర దీపాలంకరణ



లోపూడిలో స్వామి వార్లకు ప్రత్యేక పూజలు



స్వామివారి ప్రత్యేక అలంకరణ

తిరువూరు: ధనుర్మాస ఉత్సవాలను తిరువూరులోని పలు దేవాలయాల్లో ఆదివారం ప్రారంభించారు. వేంకటాచలస్వామి ఆలయం, కోదండ రామాలయం, రాజ్యలక్ష్మీ సమేత రంగనాయక స్వామి ఆలయం, రాజుపేట వీరాంజనేయస్వామి ఆలయాల్లో ఉదయం 5 గంటలకు ఈ ఉత్సవాలను ప్రారంభించారు. వైష్ణవ సంప్రదాయానుసారం తిరుప్పావై సేవ, విశేష పాశురం నిర్వహించారు. శ్రీమాన్ ఎన్‌సీహెచ్ వితలా చార్యులు, దేవయాజనం వేణుగోపాలాచార్యులు, పార్థసారథాచార్యులు ఆధ్వర్యంలో ఆయా దేవాలయాల్లో ధనుర్మాస ప్రత్యేక పూజలు జరిపారు. వైష్ణవ గోష్టి సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

వెంకటాచలస్వామికి సహస్ర దీపాలంకరణ

తిరువూరు: స్థానిక వేంకటాచలస్వామి ఆలయంలో ఆదివారం సహస్ర దీపాలంకరణ సేవ నిర్వహించారు. మార్గశిర మాస సందర్భంగా ఉదయం పుష్పయాగంలో వివిధ పుష్పాలతో స్వామివారిని అలంకరించారు. గుడిమెట్ల జగన్నాథరావు ఈ కార్యక్రమం నిర్వహించారు. సహస్ర దీపాలంకరణను జవాజి శ్రీనివాసరావు జరిపారు. ఆలయ అర్చకులు వేణుగోపాలాచార్యులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి.

ధనుర్మాస పూజలు ప్రారంభం

ముసునూరు: మండలంలోని పలు దేవాలయాల్లో ధనుర్మాస ప్రత్యేక పూజలు అత్యంత భక్తి శ్రద్ధలతో అరంభించారు. లోపూడిలోని కోదండరామాలయం, గోపవరం శివారు నాగేంద్రపురం, పెదపాటివారి గూడెంలలోని నాగేంద్రస్వామి దేవస్థానం, రామాలయం వద్ద ఆదివారం తెల్లవారు జాము నుంచి ప్రత్యేక అష్టోత్తరాలు, పూజలు ఆరంభించారు. ఆలయాల ప్రధానార్చకులు కిరణ్‌కుమార్, చిట్టిబాబు ఆధ్వర్యంలో అభిషేకాలు, తిరుప్పావై, శ్రీకృష్ణ అష్టోత్తరం, గోదాదేవి అష్టోత్తరం, విష్ణు సహస్ర నామ పారాయణ నిర్వహించారు. నెల రోజులపాటు జరుగనున్న ధనుర్మాస ప్రత్యేక పూజాదికాల్లో భక్తులు అధికంగా పాల్గొనాలని కోరారు.

వైభవంగా ధనుర్మాస ఉత్సవాలు ప్రారంభం

ఆగిరిపల్లి: ఆగిరిపల్లిలోని శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీ నరసింహ స్వామివారి ధనుర్మాస ఉత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభించారు. ఉదయం స్వామివారికి సుప్రభాత సేవ, గోదాదేవి అమ్మవారికి స్నపన, తిరుమంజనం, అలంకరణ కుంకుమార్చన, తిరుప్పావై సేవాకాలం, భక్తులకు తీర్థప్రసాదాలు వినియోగించారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి భవాని పర్యవేక్షణలో ఆలయ ప్రధాన అర్చకులు వేదాంతం శేషుబాబు, అనంతకృష్ణలు పూజలు చేశారు.

21న చెకుముకి మండలస్థాయి పరీక్ష

తిరువూరు: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 21న చెకుముకి సామర్థ్య పరీక్ష మండల స్థాయిలో నిర్వహిస్తున్నట్లు వేదిక జిల్లా కార్యదర్శి గంగాధర్ తెలిపారు. 8, 9, 10 తరగతుల్లో గతంలో ఎంపికైన విద్యార్థులు మండల స్థాయి సామర్థ్య పరీక్షకు హాజరవ్వాలని కోరారు. విద్యార్థుల్లో శాస్త్రీయ విజ్ఞానంపై అవగాహన పెంపొందించేందుకు, మూఢ నమ్మకాలను పారదోలేందుకు పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

నేడు సుబ్రహ్మణ్య స్వామి కల్యాణ మహోత్సవం

ముసునూరు: సుబ్రహ్మణ్య షష్టి సందర్భంగా గోపవరం శివారు నాగేంద్రపురంలోని ప్రసిద్ధ శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానం వద్ద సోమవారం స్వామివారి తిరు కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహిస్తున్నట్లు పూజారి చిట్టిబాబు ఆదివారం తెలిపారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో 2 వేల మంది భక్తులకు అన్న సంతర్పణ ఏర్పాట్లు గావించినట్లు చెప్పారు. భక్తులు వేలాదిగా హాజరై స్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని తిలకించాలని కోరారు.

పథకాలపై ప్రజలకు అవగాహన



కె.తాడేపల్లి(విజయవాడరూరల్): కొత్తూరు తాడేపల్లి గ్రామంలో ఆదివారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఈవోఆర్డీ బీఎల్‌వీ శేషగిరిరావు మాట్లాడుతూ ప్రపంచంలో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ కలిగిన దేశంగా భారత్ ఉందన్నారు. వెలగలేరు ప్రాథమిక కేంద్రం మెడికల్ అధికారి షేక్. సైరాబి మాట్లాడుతూ సమగ్ర ఆరోగ్య సంరక్షణ సేవల గురించి వివరించారు. పీఎం ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య మౌలిక సదుపాయాల కల్పన గురించి వివరించారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన, స్వచ్ఛ భారత్ మిషన్, ఉజ్వల యోజన గురించి వివరించారు. గ్రామ సర్పంచ్ ఉయ్యూరు గోపాలరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలోఎంపీటీసీ సభ్యురాలు బసవమ్మ, వైఎస్సార్ క్రాంతి పథం సీసీ ఎం. రామారావు, గ్రామ పంచాయతీ కార్యదర్శి పి.మురళీమోహనరావు, గ్రామ వైఎస్సార్ సీపీ కన్వీనర్ పి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఎత్తిపోతల పథకాన్ని పూర్తిచేయాలి

చాట్రాయి: చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని పూర్తిచేయాలని నూజివీడు మాజీ ఎమ్మెల్యే చిన్నం రామకోటయ్య కోరారు. ఆదివారం చాట్రాయిలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల నూజివీడులో నిర్వహించిన పట్టాల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు చింతలపూడి ఎత్తిపోతల పూర్తి చేయాలని విన్నవించారని తెలిపారు. దీనికి స్పందించిన సీఎం చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తానని రైతులకు హామీ ఇచ్చారని పేర్కొన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే లోపుగా పనులు పూర్తి చేసి రైతులకు మేలు చేయాలని కోరారు. కార్యక్రమంలో చాట్రాయి మాజీ సర్పంచ్ జోజి, అత్తునూరి సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు కృషి



మాట్లాడుతున్న కొల్లూరి, వేదికపై అశోక్‌కుమార్, బోడి ఆంజనేయరాజు, సుబ్బయ్య తదితరులు

విజయవాడకల్చరల్: తెలుగు భాష, సంస్కృతీ సంప్రదాయాల పరిరక్షణకు ఎక్స్‌రే సాహిత్యసేవా సంస్థ కట్టుబడి ఉందని ఎక్స్‌రే సాహిత్యసేవా సంస్థ అధ్యక్షుడు కొల్లూరి అన్నారు. సంస్థ ఆధ్వర్యంలో సూర్యారావుపేటలోని బుక్ ఫెస్టివల్ సొసైటీ హాల్‌లో ఆదివారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కొల్లూరి మాట్లాడుతూ సంస్థ ద్వారా 13 సంవత్సరాలుగా నెల నెలా వెన్నెల పేరుతో కవిత్వ పాఠశాలను నిర్వహిస్తున్నామన్నారు. సంస్థ ప్రధాన కార్యదర్శి బోడి ఆంజనేయరాజు మాట్లాడుతూ యువ కవులకు వేదిక కల్పించడానికి సంస్థ కృషి చేస్తోందని తెలిపారు. సమావేశంలో సంస్థ సభ్యులు అశోక్‌కుమార్, సీహెచ్‌వీ సుబ్బయ్య, బోడి ఆంజనేయరాజు పాల్గొన్నారు. 2024వ సంవత్సరానికి గానూ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడు కొల్లూరి, ప్రధాన కార్యదర్శి బోడి ఆంజనేయరాజు, కోశాధికారి సీహెచ్‌వీ సుబ్బయ్య, సాహిత్య కార్యదర్శి శింగంపల్లి అశోక్‌కుమార్, ఉపాధ్యక్షులుగా కందికొండ రవికిరణ్, పాత్తూరి సీతారామారావు, గుర్రం ఏడుకొండలు, అప్పన వెంకట సత్యబాబు, డాక్టర్ బ్రహ్మదేశం వసంతకుమార్, సాంస్కృతిక కార్యదర్శులుగా అల్లూరి సత్య శ్రీనివాసరాజు, కేజే చంద్రరావు, వెంట్రప్రగడ సర్వేశ్వరరావు, మహిళా విభాగం నిర్వాహకులుగా కొల్లా జయశ్రీ, సామినేని శైలజ, డి.శ్రీవల్లి, సి.ఉమామహేశ్వరిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యదర్శి బోడి ఆంజనేయరాజు ప్రమాణ స్వీకారం చేయించారు. ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం అధ్యక్షుడు సోమేపల్లి వెంకటసుబ్బయ్య మృతికి సంస్థ సంతాపం ప్రకటించింది. సంస్థ సభ్యులు ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు.

డీఎస్పీ ఆకస్మిక తనిఖీలు



ముసునూరు పోలీస్‌స్టేషన్‌లో మాట్లాడుతున్న డీఎస్పీ అశోక్‌కుమార్‌గౌడ్

ముసునూరు: డివిజన్ పరిధిలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నూజివీడు డీఎస్పీ ఈడే అశోక్‌కుమార్‌గౌడ్ సూచించారు. ముసునూరు పోలీస్ స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా అశోక్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ పెద్ద మొత్తంలో నగదు, నగలతో ప్రయాణాలు చేయవద్దని సూచించారు. ముఖ్యంగా మహిళలు అత్యంత అప్రమత్తంగా ఉండేలా చైతన్య పర్చాలని ఎస్ఐ ఎం.కుటుంబరావుకు సూచించారు. అనుమానాస్పదంగా గ్రామాల్లో కొత్త వ్యక్తులు తారసపడితే ప్రజలు తక్షణమే పోలీసులకు సమాచారం అందించేలా వివరించాలన్నారు. పెండింగ్ కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. సమావేశంలో సీఐ బాల సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంధన పొదుపు అందరి బాధ్యత

ఈఈ సత్యనారాయణ



నూజివీడులో ఇంధన పొదుపు వారోత్సవాలపై ర్యాలీ నిర్వహిస్తున్న విద్యుత్ అధికారులు, సిబ్బంది

నూజివీడు: ప్రతి ఒక్కరూ ఇంధనాన్ని పొదుపు చేయడం అలవర్చుకోవాలని ఏపీసీపీడీసీఎల్ నూజివీడు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎ.సత్యనారాయణ తెలిపారు. ఇంధన వారోత్సవాల్లో భాగంగా విద్యుత్ సిబ్బంది పట్టణంలోని ఈఈ కార్యాలయం వద్ద నుంచి చిన్నగాంధీబొమ్మ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఈ మాట్లాడుతూ ఇంధనాన్ని విచ్చలవిడిగా వాడటం వల్ల పర్యావరణం దెబ్బతింటుందని తెలిపారు. జాగ్రత్తలు పాటించడం ద్వారా ఇంధనాన్ని పొదుపు చేస్తే మానవ మనుగడకు దోహదం చేసినట్లేనని చెప్పారు. విద్యుత్ వినియోగదారులు గృహాల్లో, షాపుల్లో విద్యుత్ వాడకంలో పలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అవసరం లేకపోయినా విద్యుత్‌లైట్లు వేసి ఉంచడం, ఫ్యాన్లు వేయడం, టీవీని ఆన్‌లోనే ఉంచడం వంటివి చేయకూడదన్నారు. ఒక విద్యుత్ యూనిట్‌ను ఆదా చేసినట్లయితే రెండు యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసినట్లేనన్నారు. ఐఎస్ఐ మార్కు ఉన్న విద్యుత్ పరికరాలనే వాడాలని, ఎక్కువ విద్యుత్‌ను ఖర్చు చేసే బల్బులకు బదులుగా ఎల్ఈడీ బల్బులను వాడాలని సూచించారు. ఇంటి నుంచి బయటకు వెళ్లేటప్పుడు అన్ని స్విచ్‌లను నిలిపివేయాలని కోరారు. కార్యక్రమంలో విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



మున్సిపల్ వైస్ చైర్మన్ పగడాల సత్యన్నారాయణను సన్మానిస్తున్న పెన్షనర్లు

నూజివీడు: ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని మున్సిపల్ వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ అన్నారు. ఏపీ ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని డీఏఆర్ కళాశాల ఆవరణలోని సెమినార్ హాల్లో ఆదివారం పెన్షనర్స్ డే నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మున్సిపల్ వైస్ చైర్మన్ మాట్లాడుతూ నేడు పెన్షన్ పొందుతున్నారంటే శ్రీధర్ స్వరూప్ నకరా చేసిన కృషి వెలకట్టలేనిదన్నారు. పెన్షనర్లందరూ ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ భావి జీవితాన్ని ఆనందంగా గడపాలని కోరారు. అనంతరం సత్యనారాయణతో పాటు పలువురు పెన్షనర్లను సన్మానించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు వంగల గోవిందరావు, కార్యదర్శి సోమయాజులు, జిల్లా ఉపాధ్యక్షుడు ఈమని శేషయ్య, కే వెంకటేశ్వరరావు, రాళ్లపల్లి సత్యన్నారాయణ, అంజమ్మ, నరసింహారావు, ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

మారుమూల ప్రాంతాల్లో సమావేశాలు వద్దు

మైలవరం: స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను బస్ సౌకర్యం ఉన్న మండలంలో ఏర్పాటు చేయాలని పీఆర్‌టీయూ మైలవరం మండల అధ్యక్షులు పి.గోపాల్ తెలిపారు. పీఆర్‌టీయూ కార్యాలయంలో ఆదివారం గోపాల్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయుల స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు ప్రతి నెలా జరుగుతున్నాయని, మారుమూల ప్రాంతంలోని హైస్కూల్‌లో సమావేశం నిర్వహించడం వలన బస్ సౌకర్యం లేక ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలకు రెడ్డిగూడెం, మైలవరం, విస్సన్నపేట మండలాల ఉపాధ్యాయులు బస్ సౌకర్యం లేని ప్రాంతాలకు వెళ్లి తిరిగి రావడానిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కనీసం నియోజకవర్గ హెడ్ క్వార్టర్‌లోని హైస్కూల్‌లో నిర్వహించాలని కోరారు. ముఖ్యంగా గణితం స్కూల్ కాంప్లెక్స్ సమయాన్ని ఉదయం 9గంటల నుంచి 4గంటల వరకు నిర్వహించాలని కోరారు. పీఎఫ్, ఏపీజీఎల్ఐ, పార్టు పే మెంట్‌లు వెంటనే చెల్లించాలని తీర్మానించారు. అలాగే పీఆర్‌సీ ఎరియర్స్‌ను ఎస్ఆర్‌లో నమోదు చేయాలని కోరారు. సమావేశంలో ఉపాధ్యాయులు సీహెచ్ సతీష్‌కుమార్, ఎస్ శేషగిరిరావు, రాష్ట్ర యూనియన్ కార్యదర్శి ఏ. పుల్లారెడ్డి,హర్షనందిని, పద్మజ తదితరులు పాల్గొన్నారు.

హిందీలో ప్రావీణ్యత సాధించాలి



సర్టిఫికెట్లు పొందిన విద్యార్థులు

తిరువూరు: విద్యార్థులు జాతీయ భాష హిందీలో ప్రావీణ్యత సాధించాలని దక్షిణ భారత హిందీ ప్రచార సభ ప్రచారక్ రేపాక రఘునందన్ సూచించారు. గత సెప్టెంబరులో ప్రచార సభ నిర్వహించిన హిందీ పరీక్షల్లో ఉత్తీర్ణులైన తిరువూరు పట్టణంలోని విద్యార్థులకు సర్టిఫికెట్లను ఆదివారం అందజేశారు. విద్యార్థి దశలోనే వివిధ భాషల్లో ప్రావీణ్యం సంపాదించాలని తెలిపారు.

మధుర స్వరాల కంఠశాల ఘంటసాల



ఘంటసాల చిత్రగీతాలు ఆలపిస్తున్న గాయనీ గాయకులు

విజయవాడకల్చరల్: మధుర స్వరాల కంఠశాల ఘంటసాల అని పద్మశ్రీ ఘంటశాల, వి.రామకృష్ణ సాంస్కృతిక సేవా సంస్థ(ఒంగోలు) పెండ్యాల సాయి మాష్టారు అన్నారు. పద్మశ్రీ ఘంటసాల, వీ రామకృష్ణ సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో గాయకుడు ఘంటసాల 101వ జయంతి, సినీ నటుడు అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి వేడుకలు, సినీ సంగీత విభావరి కార్యక్రమాన్ని గాంధీనగర్ హనుమంతరాయ గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించారు. కార్యక్రమాలను ప్రారంభించిన సాయి మాష్టారు మాట్లాడుతూ తెలుగు పాటకు జాతీయ స్థాయి గుర్తింపు తెచ్చిన గాయకుడు ఘంటసాల మాష్టారన్నారు. అక్కినేని నాగేశ్వరరావు లేని తెలుగు సినిమా పరిశ్రమను ఊహించలేమని ఇద్దరూ కృష్ణాజిల్లా వారు కావడం తెలుగు సినిమా పరిశ్రమ చేసుకున్న అదృష్టమన్నారు. అక్కినేని, ఘంటసాల కాంబినేషన్‌లో అనేక చిత్రాలు విజయవంతమయ్యాయని చెప్పారు. స్వరాంజలి కార్యక్రమంలో భాగంగా గాయనీ గాయకులు పెండ్యాల మాష్టారు, మువ్వా నాగేశ్వరరావు, బియ్యపు శ్రీను, రామయ్య, సంజీవ్, సౌజన్య సుహాసిని తదితరులు ఘంటసాల, రామకృష్ణ గానం చేసిన గీతాలను మధురంగా గానం చేశారు. నిర్వాహకులు ఘంటసాల, అక్కినేని, రామకృష్ణ చిత్రపటాలకు నివాళులర్పించారు. కార్యక్రమంలో డ్రీమ్ ఆడియో అధినేత చావా నరసింహారావుతో, పెద్ద సంఖ్యలో ఘంటసాల అభిమానులు పాల్గొన్నారు.

సర్వశుభకరుడు సుబ్రహ్మణ్యుడు

విజయవాడకల్చరల్: సర్వశుభకరుడు శ్రీ సుబ్రహ్మణ్యుడని శివజ్ఞాన పీఠాధిపతి శివచార్య స్వామి అన్నారు. శివజ్ఞానపీఠం ఆధ్వర్యంలో దుర్గాపురంలోని సంగీత కళాశాలలో నిర్వహిస్తున్న శ్రీవైభవ సర్పసుబ్రహ్మణ్యయాగ క్రతువు ఆదివారం రెండో రోజుకు చేరుకుంది. శివస్వామి మాట్లాడుతూ సుబ్రహ్మణ్య స్వామి అర్చన, యాగ క్రతువుల వల్ల దోషాలు నశించి శుభాలు కలుగుతాయన్నారు. భారతీయ ఆధ్యాత్మిక వైభవం ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తోందని యువతను ఆధ్యాత్మిక, భక్తి భావన వైపు మళ్లించాల్సిన అవసరముందని చెప్పారు. స్వామిజీలు, ఆచార్యులు ఉపదేశాలను పాటించాలని కోరారు. ఉదయం కార్యక్రమంలో భాగంగా నిత్యవిధి, ద్వితీయకాల యాగ పూజ, మాడవీధి ఉత్సవం వైభవంగా నిర్వహించారు. యాగంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో పేర్ల రాంప్రసాద్ కె.విద్యాధరరావు, గార్లపాటి సుదర్శన్, పెనుగొండ సుబ్బారాయుడు పవిత్ర డైమండ్స్ రాజేష్ పాల్గొన్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

నేటి కార్యక్రమాలు

సోమవారం నాటి కార్యక్రమంలో నిత్యవిధి, చతుర్థ కాల పూజ, శ్రీ సుబ్రహ్మణ్య మూలమంత్రహోమం జరుగుతాయని మాతా శివచైతన్య చెప్పారు. వాసుదేవానందగిరి స్వామి పాల్గొంటారన్నారు.